క్లుప్తంగా

2 నుంచి కార్తిక మాస పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చే నెల రెండు నుంచి డిసెంబరు రెండు వరకు కార్తిక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేదీ కార్తిక మాసం తొలి సోమవారం, 5న నాగుల చవితి, 6న నాగుల పంచమి, 11న రెండవ సోమవారం, 12న శుద్ధ ఏకాదశి, 13న క్షీరాబ్ది ద్వాదశి, 15న కార్తిక పౌర్ణమి, 18న కార్తిక 3వ సోమవారం, 25న 4వ సోమవారం, 26న బహుళ ఏకాదశి, 29న మాస శివరాత్రి సందర్భంగా అన్నాభిషేకం, నవగ్రహ మహా మృత్యుంజయ సహిత రుద్ర హోమం జరుగునని చెప్పారు. డిసెంబరు 2న పోలి పాడ్యమి పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డెప్యూటీ రిజిస్ట్రార్‌గా సాయిబాబు



పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ డెప్యూటీ రిజిస్ట్రార్‌గా సాయిబాబాను నియమించారు. ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులను వైస్ ఛాన్సలర్ వెంకటేశ్వరరావు సాయిబాబుకు అందజేశారు. గతంలో సాయిబాబు కాలేజీలో ఏటగా విధులు నిర్వహించారు. వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టు బీ యూనివర్సిటీగా మారడంతో సిద్ధార్థ అకాడమీ యాజమాన్యం సాయిబాబును డెప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

నున్న(విజయవాడరూరల్): దాళ్వా పంటల సాగుకు పోలవరం కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయాలని పలు గ్రామాల్లోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. నున్న, విలేజి కుందావారి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లోని చెరువుల్లో ముందుగా సాగునీరు నిల్వ చేసుకుంటే దాళ్వా సాగు పనులు చేపట్టేందుకు వీలుగా ఉంటుందని రైతులు అంటున్నారు. నున్న గ్రామంలో పుల్లయ్య చెరువు, జంగమవాని చెరువు, బూరుగల చెరువు, విలేజి కండ్రికలో కుందావారి కండ్రిక చెరువు, పాతపాడులో ఎర్ర చెరువు, పి.నైనవరంలో కుక్కలవాని కుంట, చెరువుల ఆయకట్టు వ్యవసాయ భూములకు అవసరమైన సాగునీటిని పోలవరం కాలువ నుంచి రైతులు ఉపయోగిస్తుంటారు.

ఎన్టీటీఎఫ్ కళాశాల రోడ్డుకు మెరక



దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో ఎన్టీటీఎఫ్ కళాశాల రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో పాటు వర్షం నీరు నిలిచి చిన్న సైజు చెరువును తలపిస్తోంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు ఎన్టీటీఎఫ్ కళాశాల, ఎస్సీ, బీసీ ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులు, రమణమ్మ చెరువు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ నిధులతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లంగా ఉన్న రోడ్డును గ్రావెల్ మట్టితో మెరక చేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొమ్ము సుగుణమ్మ (104) శనివారం రాత్రి అస్వస్థతకు గురై మృతిచెందారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సుగుణమ్మకు ఆరుగురు కుమారులు ఉన్నారు. గ్రామస్తులు ఆమె మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.

వైభవంగా గ్యార్మీ పండుగ



పెనమలూరు: గోసాల ఇస్లాంపేటలో ఆదివారం గ్యార్మీ పండుగను భక్తులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో జెండాలు పట్టుకుని పెద్ద ఎత్తున ప్రదర్శన చేశారు. జెండా చెట్టు వద్ద జెండాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కాగా ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, సర్పంచి సంగెపు శ్రీనివాసరావుతోపాటు గ్రామ పార్టీ అధ్యక్షుడు పోలవరపు రవి, వార్డు సభ్యులు ఎండి. ఆసీఫ్ పాషా, హాజీ ఆలీ, ఎస్‌కె. బాజీ, రహీం, తలీమ్, ఆలీమ్, సహేంషా, భక్తులు పాల్గొన్నారు.

వంతెన.. ఇక అంతేనా!

- శ్మశాన వాటికకూ వెళ్లలేక అవస్థలు
- పోలవరం కాలువపై వంతెన నిర్మాణం పూర్తి చేయాలి
- కొత్తగూడెం గ్రామస్తుల డిమాండ్



కొత్తగూడెం వద్ద పోలవరం కాలువపై నిలిచిపోయిన వంతెన నిర్మాణం

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం గ్రామస్తులు పోలవరం కాలువపై వంతెన లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోలవరం కాలువ నిర్మాణ సమయంలో ఈ గ్రామం వద్ద కాలువపై వంతెన నిర్మాణానికి డిజైన్ రూపొందించకపోవడంతో ఆనాటి నుంచి నేటి వరకు గ్రామస్తుల అవస్థలకు అంతులేదు. ఈ గ్రామంలో వెయ్యి మందికి పైగా జనాభా ఉన్నారు. ప్రధానంగా వ్యవసాయం, గొర్రెలు, మేకలు, గేదెల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మండలంలోనే అత్యధికంగా పశుసంపద ఉన్న గ్రామం కొత్తగూడెం.

ఆగిపోయిన నిర్మాణ పనులు

కొత్తగూడెం గ్రామస్తుల ఆందోళనలు, వినతులు తర్వాత ఈ గ్రామం వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే పిల్లర్స్ దశలోనే ఆ పనులు ఆగిపోయాయి. పురోగతి లేదు. గ్రామస్తుల కష్టాలు అలాగే మిగిలిపోయాయి. ఎన్నిసార్లు పాలకులకు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని గ్రామస్తులు వాపోతున్నారు. వంతెన నిర్మాణం పూర్తి చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

కాలువ అవతల పంట పొలాలు

ఈ గ్రామాన్ని ఆనుకుని వెళుతున్న పోలవరం కాలువ అవతల వైపు గ్రామానికి చెందిన రైతుల పంట భూములు ఉన్నాయి. 400 ఎకరాలు పైగా భూములు ఉండగా, ఆ భూముల్లోకి నిరంతరం వ్యవసాయ పనుల కోసం రైతులు, కూలీలు వెళ్లాల్సి ఉంది. వంతెన లేని దుస్థితిలో చిక్కవరం వంతెన వద్దకు వెళ్లి చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. పశువులు మేపుకొనేందుకు సైతం ఇదే పరిస్థితి నెలకొని ఉంది. గ్రామానికి చెందిన శ్మశానం సైతం పోలవరం కాలువ అవతల వైపునే ఉంది. దీంతో కాలువ దాటి వెళ్లలేక పోలవరం కాలువ కట్ట పక్కనే గ్రామం చెంత అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది.

వంతెన నిర్మించి ఆదుకోవాలి



వ్యవసాయ పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జీవాలకు మేత లేకుండా పోయింది. పశుసంపద తగ్గిపోతోంది. పాలకులు, అధికారులు చర్యలు తీసుకొని వంతెన నిర్మించి ఆదుకోవాలి.

అంగడాల సాంబశివరావు, రైతు, కొత్తగూడెం

అవతలి వైపునకు దారి లేదు



జీవాలను మేత కోసం అవతలి వైపు తోలుకుని వెళదామంటే దారి లేదు. చిక్కవరం వద్ద ఇటీవల వరదలకు గండిపడింది. దీంతో పశువులకు మేత లేదు. పోలవరం కాలువపై వంతెన నిర్మిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

చేకూరి శ్రీనివాసరావు, రైతు, కొత్తగూడెం

వంతెన లేక అవస్థలు



అన్ని గ్రామాల్లో వంతెనలు నిర్మించారు. కొత్తగూడెం వద్ద విస్మరించారు. గ్రామస్తులు చనిపోతే ఇళ్ల వెంటే అంత్యక్రియలు నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వంతెన నిర్మాణం పూర్తి చేసి ఆదుకోవాలి.

కొణతం శ్రీమన్నారాయణ, పశుపోషకుడు, కొత్తగూడెం

నేడు రహదారి అభివృద్ధి కోసం పాదయాత్ర

ఉంగుటూరు: కంకిపాడు–మానికొండ–గుడివాడ ప్రధాన రహదారి అధ్వాన పరిస్థితిపై 'ఇది రహదారా.. మృత్యు మార్గమా' అనే నినాదంతో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కంకిపాడు మండలం కోమటిగుంట లాకులు నుంచి గుడివాడ వరకు సోమవారం 27 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీ లక్ష్మణస్వామి, మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నియోజకవర్గాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతూ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కోమటిగుంట లాకులు నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ పాదయాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివి



రాఘవాచారికి పురస్కారం అందజేస్తున్న యల్లా వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గౌరీనాథ్

విజయవాడకల్చరల్: సంగీత శేఖర శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యుల సంగీత సేవలు వెలకట్టలేనివని పద్మశ్రీ పురస్కార గ్రహీత, మృదంగ విద్వాంసుడు డాక్టర్ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. కృష్ణమాచార్య కళాపీఠం ఆధ్వర్యంలో కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఐదు రోజులుగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న యల్లా మాట్లాడుతూ.. సంప్రదాయ సంగీత కుటుంబానికి చెందిన కృష్ణమాచార్యులు బహుభాషా కోవిదుడని గుర్తుచేశారు. ఆయన ఎందరో కళాకారులను సంగీత విద్వాంసులుగా తీర్చిదిద్దారన్నారు.

అలరించిన సంప్రదాయ కీర్తనలు..

ఆకాశవాణి విజయవాడ కేంద్రం సంచాలకుడు బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కృష్ణమాచార్య కళాపీఠం సంగీత రంగంలో విశేషమైన కృషి చేసిన వారికి స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి సుదీర్ఘకాలం సేవలను అందించినట్లు గుర్తు చేశారు. 2024 సంవత్సరానికి గాత్ర విద్వాంసులు హైదరాబాద్ సోదరుల్లో ఒకరైన డి. రాఘవాచారికి కృష్ణమాచార్యులు స్ఫూర్తి పురస్కారం ప్రదానం చేశారు. ఉదయం ప్రారంభమైన సంగీత సేవలో అనఘ, హరిద్ర, శాంతిశ్రీ, రామలక్ష్మి బృందం, చిన ముక్తేవి సంజన, టీకేవీ రామానుజాచార్యులు, పద్మావతి తదితరులు భక్తిగా సంప్రదాయ కీర్తనలను ఆలపించారు. కేవీపీ శాస్త్రి, కేఎస్ గోవిందరాజన్, విష్ణుభొట్ల సోదరీమణులు, గాయత్రి గౌరీనాథ్ పాల్గొన్నారు. సంగీత కళాకారులు పోపూరి గౌరీనాథ్ నిర్వహించారు.

రౌడీషీటర్లకు పోలీస్ కౌన్సిలింగ్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ సురేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి. సురేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్లపై నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు అందరూ తాజా కలర్ ఫొటోలను పోలీస్‌స్టేషన్‌లో అందించాలని ఆదేశించారు. ప్రతి నెలా స్టేషన్‌కు హాజరై సత్ప్రవర్తన రుజువు చేసుకోవడంతో పాటు, కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో నిర్దోషులుగా తెలితే రౌడీషీట్‌ను ఎత్తివేసేందుకు సిఫార్సు చేస్తామని ఎస్ఐ సురేష్ తెలిపారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రస్తుతం 36 మందిపై రౌడీషీట్ ఉందని, వీరిలో ఇద్దరు పొరుగు ప్రాంతాలకు నివాసం వెళ్లిపోయినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో సాహిత్య సంస్థలు పునరంకితం కావాలి



అమరావతి ఫౌండేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న హరికృష్ణ, నారాయణరావు తదితరులు

విజయవాడకల్చరల్: సమాజ పురోభివృద్ధిలో సాహిత్య కళా సంస్థలు పునరంకితం కావాలని జానపద అకాడమీ తొలి అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ సూచించారు. లేపాక్షి ఫౌండేషన్ ఆవిర్భావ సభను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమలోని వెనుకబడిన ప్రాంతానికి చెందిన నలుగురు యువకులు సాహిత్యం, సమాజ హితం కోసం లేపాక్షి సంస్థను స్థాపించారని తెలిపారు. సమకాలీన సాహిత్యం సామాన్యులకు చేరుకోవాలనే వారి ఆశయ సంకల్పం సఫలం కావాలని ఆకాంక్షించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ.. కవులు రచయితల సమాజాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. అమరావతి ఫౌండేషన్ అధ్యక్షురాలు మద్దుల విజయలక్ష్మి నిర్వాహకులకు సాహిత్య కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో లేపాక్షి ఫౌండేషన్ నిర్వాహకులు వడ్డి సుధాకర్, డి. శ్రీనివాసులు, చిన్నారి అనిల్, అశోక్ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. సంస్థ లోగోను అతిథులు ఆవిష్కరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు పింక్ ర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని విజయవాడ నగరంలో ఆదివారం పింక్ రిబ్బన్ ర్యాలీ నిర్వహించారు. రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డులో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి బెంజిసర్కిల్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రూట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి. విజయభాస్కర్ మాట్లాడుతూ పింక్ కలర్ కాన్సెప్ట్‌తో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రూట్స్ సభ్యులు చందు శ్రీనివాస్, యలమందయ్య, మహాదేవ్, తారకలక్ష్మి, సావిత్ర తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ చర్యలు అభినందనీయం

కంకిపాడు: విమానాల్లో ప్రయాణించే అయ్యప్ప భక్తులు, మాలధారుల సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందనీయమని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. అయ్యప్ప మాలధారులు విమానాల్లో ప్రయాణించే క్రమంలో ఇరుముడులతో సహా ప్రయాణించేందుకు కేంద్ర విమానయాన శాఖ అనుమతి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. మాలధారుల మనోభావాల పరిరక్షణ నిమిత్తం కేంద్ర సర్కారు చర్యలు తీసుకుందని వివరించారు.

వ్యభిచార గృహంపై దాడి

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలో గుట్టు చప్పుడు కాకుండా సాగిస్తున్న వ్యభిచార గృహంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు.. కాలనీలోని రెండవ రోడ్డులో అద్దె గృహంలో ఉంటున్న మోత్కూరు రజని కేటరింగ్ పనులు చేస్తుంటుంది. ఇటీవల ఆమెతోపాటు ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శనివారం రాత్రి రజని ఇంటిపై పోలీసులు దాడి చేశారు. రజనితోపాటు విజయవాడకు చెందిన మరో మహిళ, వైజాగ్‌కు చెందిన విటుడు పట్టుబడినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఘనంగా అఖండ జపమాల



పెనమలూరు: కానూరు కార్మెల్ మాత పుణ్యక్షేత్రంలో ఆదివారం అఖండ జపమాల ఘనంగా చేశారు. విచారణ గురువు ఫాదర్ సలివేంద్రశౌరి ఆధ్వర్యంలో అక్టోబర్ మాసం పరిశుద్ధ జపమాల సందర్భంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు వెయ్యిసార్లు జపమాల జరిపారు. కార్యక్రమంలో సీటీసీ సిస్టర్స్, ఉపదేశకులు, దళ సభ్యులు, పోరంకి, సాలిపేట, గంగూరు, కామయ్యతోపు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్లు దేవదానం, రత్నరాజ్ పాల్గొన్నారు.

శృతిలయ సమ్మేళనం.. సంగీతోత్సవం



విజయవాడకల్చరల్: దృశ్యవేదిక నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. వీణాధరి సంగీత విద్యాలయం నిర్వాహకురాలు నందిని శ్రీనివాస్ పర్యవేక్షణలో ఎస్.నిఖిల ప్రియ, బి.కృష్ణకుమారి, ఎస్.తరుణి, జి.రాజేశ్వరి, సంగీత మూర్తి త్రయం త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిల కీర్తనలను వీణపై మధురంగా పలికించారు. మృదంగంపై విశ్వనాథ శరవణ, తాళంపై సీతా వైష్ణవి సహకరించారు. రంగస్థల కార్యక్రమంలో భాగంగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన సత్యహరిశ్చంద్ర నాటకంలోని అడవి సన్నివేశాన్ని కళాకారులు నటించి రక్తి కట్టించారు. హరిశ్చంద్రునిగా బుర్రా నరేన్, చంద్రమతిగా లక్ష్మీశ్రీ, నక్షత్రకునిగా పరదేశి, లోహితాస్యునిగా ఆరాధ్య నటించారు. ఈవన రమేష్‌బాబు, కత్తి శ్యాంప్రసాద్, భాగ్యరాజు పాల్గొన్నారు. కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

మండల ఆర్యవైశ్య సంఘం ఏకగ్రీవం



ఎంపికైన సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

పెనమలూరు: పెనమలూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక అయ్యింది. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సన్నిధి నాగసాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమిటీ నియామకం జరిగింది. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బుద్దా లక్ష్మణకుమార్, కార్యదర్శిగా తటపర్తి సతీష్, కోశాధికారిగా తాతా వెంకట కిషోర్‌కుమార్‌ను ఎంపిక చేశారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ప్రముఖులు మాజీ సీఎం కొణిజేటి రోశయ్య, పొట్టి శ్రీరాములు, మండల నాయకుడు బచ్చు లక్ష్మణ నరసింహారావులకు ఘనంగా నివాళులర్పించారు. నేతల విగ్రహాలు త్వరలో ప్రతిష్ఠిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ మానేపల్లి రఘురామ్‌బాబు, పీఆర్‌వో చక్కా ఆంజనేయులు, కార్యదర్శి తిరువీధి వెంకటసుబ్బారావు, మండల సభ్యులు చక్కా లక్ష్మణరాయుడు, కొప్పవరపు సూర్యనారాయణ, కొండవీటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకిలో సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

గన్నవరం: జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో స్థానిక స్రవంతి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ కొమ్మినేని రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మచిలీపట్నంలో జరిగిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో తమ పాఠశాలకు చెందిన ఎం. ప్రణీత, వై. యశ్వంత్‌పవన్, సిహెచ్. రిత్విక్ పాల్గొన్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన తమ విద్యార్థులు నవంబర్ 9, 10 తేదీల్లో వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. అనంతరం ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సిద్ధమవుతున్న బాణసంచా దుకాణాలు



గన్నవరంలో ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని శివాలయం పక్కన దీపావళి బాణసంచా విక్రయ స్టాల్స్ సిద్ధమవుతున్నాయి. ఈనెల 29 నుంచి 31వ తేది వరకు మూడు రోజుల పాటు జరిగే బాణసంచా విక్రయాల నిమిత్తం 32 స్టాల్స్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే లాటరీ పద్ధతిలో స్టాల్స్ కేటాయింపు ప్రక్రియను కూడా నిర్వాహకులు పూర్తిచేశారు. దీంతో సెంట్రింగ్ వర్కర్లతో తాత్కాలిక స్టాల్స్‌ను విక్రయదారులు ఏర్పాటు చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది అదనంగా నాలుగు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గన్నవరం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మూడు హోల్‌సేల్ గొడౌన్ల ద్వారా బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయి. అయితే దీపావళి పండుగ సమీపిస్తున్నప్పటికి బాణసంచా విక్రయాలు పెద్దగా లేకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు డీలా పడుతున్నారు. ఇటీవల సంభవించిన వరదలతో ఆస్తి, పంట నష్టం ప్రభావం, పెరిగిన బాణసంచా ధరలు విక్రయాలపై పడిందని పేర్కొంటున్నారు.

భారీగా పెరిగిన స్టాల్స్ ఖర్చులు

అయితే స్టాల్స్ ఏర్పాటుకు పలు శాఖల అనుమతుల కోసం భారీగా వెచ్చించాల్సి వస్తోందని విక్రయదారులు వాపోతున్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్యుత్, పంచాయతీ తదితర శాఖల అనుమతుల కోసం ఒక్కొక్క స్టాల్స్ నుంచి రూ. 45 వేల వరకు కేవలం ముడుపులు చెల్లించేందుకు వసూలు చేస్తున్నారని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వీటికితోడు నెల అద్దె, స్టాల్స్ నిర్మాణం, ఇతర ఖర్చుల నిమిత్తం మరో రూ. 30 వేల వరకు వెచ్చించాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో ఒక్కొక్క స్టాల్‌కు రూ. 75 వేల వరకూ ఖర్చు అవుతోందని విక్రయదారులు పేర్కొంటున్నారు.

దిగుబడి తగ్గిన మొక్కజొన్న



మొక్కజొన్న పోత పోస్తున్న కూలీలు

- పెట్టుబడులైనా వస్తాయో.. లేదోనని ఆందోళనలో రైతులు
- వర్షాలకు పంట దెబ్బతినడంతో వాటిల్లిన నష్టం



వర్షానికి తడిసిన మొక్కజొన్నను రోడ్డుపై ఆరబోసిన దృశ్యం

కంకిపాడు: మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉన్నా దిగుబడులు లేక మొక్కజొన్న రైతులు దిగులు చెందుతున్నారు. పంట చేతికి అందే తరుణంలో విరుచుకుపడ్డ భారీ వర్షాలు నిట్టనిలువునా ముంచాయి. అధిక వర్షాలు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికి వస్తాయో? లేదో? అన్న ఆందోళన మొక్కజొన్న రైతుల్లో నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కృష్ణా జిల్లా వ్యాప్తంగా 150 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేపట్టారు. కోళ్ల మేతకు వినియోగించే మొక్కజొన్న, స్వీట్‌కార్న్ కూడా ఇందులో ఉంది. ఎకరాకు 33 నుంచి 37 క్వింటాళ్ల వరకూ దిగుబడులు చేతికి వస్తాయని రైతులు భావించారు. ఎకరాకు రూ. 35 వేలు వరకూ పెట్టుబడులు పెట్టారు.

వెన్ను విరిచిన వర్షాలు

ప్రస్తుతం మొక్కజొన్న పంటను రైతులు మార్కెట్‌కు తరలిస్తున్నారు. పంట పొలంలో ఎండిపోయిన మొక్కజొన్న కండెలను కల్లాలు, రోడ్లపై ఎండబోస్తున్నారు. పూర్తిగా ఎండిన మొక్కజొన్న కండెలను యంత్రాలతో పోత పోసి శుభ్రం చేసిన మొక్కజొన్న గింజలను మార్కెట్‌కు విక్రయిస్తున్నారు. అయితే పంట కండె మీద ఉండగా గత నెలలో భారీ వర్షాలు కురిశాయి. తేమకు పురుగు ఉధృతి చెందింది. పురుగు దాడికి గింజ దెబ్బతినడంతోపాటు నాణ్యత లేకుండా పోయింది. కాటుక వేసి నలుపు రంగులోకి మారడంతో మార్కెట్‌లో తక్కువ ధర పలుకుతోంది. దీనికి తోడు కత్తెర పురుగు దాడికి పంటకు నష్టం వాటిల్లింది. ఫలితంగా ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్లు కూడా దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. వర్షాలు, వాతావరణ పరిస్థితులు ఆర్థికంగా నష్టపరిచాయని రైతులు వాపోతున్నారు.

నిరాశలో రైతన్నలు

ప్రభుత్వం మొక్కజొన్న క్వింటా మద్దతు ధరను రూ. 2,200గా నిర్ణయించింది. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ధర రూ. 2,300 నుంచి రూ. 2,400 వరకూ పలుకుతోంది. అయితే పంట నాణ్యత లేకపోవడం, దిగుబడులు పూర్తిగా తగ్గిపోవడంతో ధర ఆశాజనకంగా ఉన్నా తమకు నిరాశే మిగిలిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



గన్నవరం: న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళన బాటపట్టారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పిలుపు మేరకు నిరసన తెలియజేశారు. ఫెడరేషన్ బ్రాంచ్ అధ్యక్షుడు పి. రాజబాబు మాట్లాడుతూ పాలసీలపై ఎల్ఐసీ చెల్లిస్తున్న బోనస్‌ను పెంచాలని, పాలసీలపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి మగ్బుల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేయాలి



ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుడమేరు వరదతో నష్టపోయిన పంటలకు, ఇళ్లకు నష్ట పరిహారం అందజేయాలని కోరుతూ బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలియజేశారు. ఇంకా కొంత మంది బాధితులకు నష్టపరిహారం అందలేదని చెప్పారు. వరదల కారణంగా నీట మునిగిన ఆయిల్ ఇంజిన్లు, మోటర్లు రిపేర్ల నిమిత్తం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విమలకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీ లక్ష్మణస్వామి, మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, లంకపల్లి, ముక్కపాడు, ఓంద్రంపాడు, ఎలుకపాడు, వెల్దిపాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి



పెనమలూరు: ప్లాస్టిక్ నివారణకు అందరూ సహకరించాలని వీఆర్ సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర కోరారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దీపావళి విత్ మై భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బందరు రోడ్డు పక్కన ఉన్న రైతుబజార్ వద్ద ప్లాస్టిక్ గ్లాసులు, వ్యర్థాలు, పాడైపోయిన కూరగాయాలు తొలగించారు. తాడిగడప జంక్షన్‌లో ట్రాఫిక్ కంట్రోల్ డ్యూటీని విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సాయి రామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలైయ్యాయి. స్థానిక శేరినరసన్నపాలెం క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నూజివీడుకు చెందిన సిద్ధవరపు విజయ్‌కుమార్ హనుమాన్‌జంక్షన్ వైపు బైక్‌పై వస్తుండగా ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విజయ్‌కుమార్‌ను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రస్తుత జీవన విధానంలో ఆయుర్వేద ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ (ఇన్‌చార్జి) డాక్టర్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. న్యూ రాజీవ్ నగర్, పాయకాపురంలోని సంస్థలో 9వ ఆయుర్వేద దినోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ చేశారు. డాక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద ఆహారపు అలవాట్లు రోగాల బారిన పడకుండా మనిషి ఆయుష్‌ను పెంపొందిస్తాయని చెప్పారు. ఆయుర్వేద ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఆయుర్వేదంపై అవగాహన ర్యాలీ సంస్థ నుంచి బయలుదేరి ప్రకాష్‌నగర్ మీదుగా నున్న పోలీసు స్టేషన్ వరకు సాగింది. కార్యక్రమంలో సంస్థ సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ ఏజీవీ సాయి ప్రసాద్, ఏఎస్ఐ జే కృష్ణ, సంస్థ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం

- కూటమి ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు కరువు
- రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని సుగాలీ కాలనీవాసుల డిమాండ్



నున్న గ్రామంలోని సుగాలీ కాలనీలో అధ్వాన స్థితిలో డ్రెయినేజీ కాలువ

విజయవాడరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా పనులు చేపట్టలేదు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ ప్రజానీకం నివసించే కాలనీల్లో అభివృద్ధి కనుచూపు మేర కనిపించడం లేదనే విమర్శలు వెల్లివెత్తుతున్నాయి. నున్న గ్రామంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించేందుకు ప్రతిపాదించిన పనుల్లో సుగాలీకాలనీ లేదు. పల్లె పండుగ పేరుతో తలపెట్టిన పనుల్లో కూడా ఈ కాలనీ లేకపోవడంతో కాలనీవాసులు మండిపడుతున్నారు. పంచాయతీ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఒక్క అభివృద్ధి పని కూడా సుగాలీకాలనీలో జరగలేదు. గ్రామ పంచాయతీ నిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే గ్రాంటుల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఎటు మళ్లించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

800 కుటుంబాలు నివాసం

పాలకులు, అధికారులు మమేకమై కమిషన్ల కోసం కక్కుర్తిపడి అపార్టుమెంట్లు ఉన్న ప్రాంతాలకు సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించడం జరుగుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గ్రామ సభల్లో ప్రజలు సూచించిన ప్రాంతాల్లోనే అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చెబుతున్నారు. కానీ ఆ పరిస్థితి నున్న గ్రామంలో అమలు జరగడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. పల్లె పండుగ పేరుతో జాతీయ ఉపాధి నిధులతో మంజూరు చేసిన పనుల్లో కూడా సుగాలీకాలనీ లేకపోవడం వారిని బాధకు గురిచేస్తోంది. ఈ కాలనీలో 800 కుటుంబాలు ఉన్నాయి. సుగాలీకాలనీ పల్లం ప్రాంతం కావడంతో ఎప్పుడు వర్షాలు వచ్చినా వర్షం నీరు కాలనీ వైపు పయనిస్తుంటాయి. మోకాళ్లలోతు నీటిలో స్థానికులు ఇబ్బంది పడుతుంటారు. డ్రెయినేజీ కాల్వలు ఎక్కడవి అక్కడ మూతబడి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగునీరు వల్ల దోమలు ఉధృతి చెంది అనేక మంది డెంగ్యూ, మలేరియా జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో ఏకైక కమ్యూనిటీ హాలు అసాంఘీక శక్తులకు అడ్డాగా మారింది. రాత్రి సమయాల్లో కొందరు అక్కడికి చేరి మద్యం సేవించి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు సుగాలీకాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలావస్థలో కల్వర్టు

పట్టించుకునేవారు లేరు



ఎన్నికల సమయంలో నాయకులు ఓట్ల కోసం వచ్చి మాటల్లో స్వర్గం చూపిస్తారు. ఎన్నికలైన తర్వాత కాలనీ ప్రజలను పట్టించుకునే వారే లేరు. సుగాలీకాలనీలో రోడ్లు నిర్మించాలని, డ్రెయినేజీ కాల్వల కోసం అనేక సార్లు గ్రామ సభలో కోరినా ఒక్క పని కూడా చేయలేదు.

– దారావతు స్వాతి, పంచాయతీ వార్డు సభ్యురాలు

కనీస సదుపాయాలు లేవు



సుగాలీ కాలనీపై పాలకులు చిన్న చూపు చూస్తున్నారు. 800 కుటుంబాలున్న ఈ కాలనీలో కనీస సదుపాయాలు లేవు. కల్వర్టుపై వేసిన సిమెంటు బిళ్లలు పగిలిపోయి నడవాలంటే భయంగా ఉంది. ప్రజలు దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నారు.

– డి. రవి, స్థానికుడు

తగ్గుముఖం పట్టిన వరద

కంకిపాడు: ఏటిపాయలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. బ్యారేజీ నుంచి నీటి విడుదల తగ్గడంతో ఏటిపాయలో సాధారణ స్థితి నెలకొంటుంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల వెంబడిగా ప్రవహించే కృష్ణానది ఏటిపాయలో వరదనీరు తగ్గుతోంది. రెండు రోజులు క్రితం వరకూ వరదనీటితో ఉధృతంగా ప్రవహించిన ఏటిపాయ క్రమేపీ శాంతిస్తోంది. ప్రస్తుతం ఏటిపాయలో లంక భూములకు వెళ్లే రబ్బిష్ రోడ్డు బయటపడుతోంది. నీటి ఉరవడికి పూర్తిగా కొట్టుకుపోయి అధ్వానంగా మారింది. పాయలోని లంకభూములకు వెళ్లాలంటే రోడ్డు మార్గాన్ని సరిచేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పశుపోషకులు, జీవాల పోషకులు జీవాలు, పశువుల మేత అవసరాల కోసం పడవల్లో లంక భూముల్లోకి వెళ్లి పశుగ్రాసం సేకరించి గ్రామంలోకి తీసుకువస్తున్నారు. లంకల్లో వ్యవసాయ పనులకు సైతం రైతులు, కూలీలు పడవలను వినియోగిస్తున్నారు.



పడవలో మేత తీసుకువస్తున్న రైతులు

రహదారి అభివృద్ధి చేయాలంటూ పాదయాత్ర

కంకిపాడు/ఉంగుటూరు: సీపీఎం ఆధ్వర్యంలో కోమటిగుంట-గుడివాడ వరకూ రోడ్డు అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాదయాత్ర చేపట్టారు. కోమటిగుంట లాకులు వద్ద పాదయాత్రను పార్టీ సీనియర్ నేత వేమూరి నాగేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు మాట్లాడుతూ కంకిపాడు నుంచి గుడివాడ వరకూ ఉన్న ప్రధాన రహదారి గోతులమయంగా మారిందన్నారు. నిత్యం ఈ రోడ్డు మార్గంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ మార్గం గుండా ప్రయాణం అంటేనే ప్రజలు హడలిపోతున్నారన్నారు. ప్రజల కష్టాలను పాలకులు గుర్తించడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రోడ్డు అభివృద్ధి సమస్యను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లాకుల లక్ష్మణస్వామి, కోసూరు శివనాగేంద్రం, జిల్లా కమిటీ సభ్యుడు పి.రంగారావు, పార్టీ కంకిపాడు మండల కార్యదర్శి తాడంకి నరేష్, ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, పెదపారుపూడి కార్యదర్శి వడుగు గంగాధర్, గుడివాడ మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోమటిగుంట లాకులు నుంచి ప్రారంభమైన సీపీఎం పాదయాత్ర

అధికారులు బదిలీ అయినా పేర్లు మారలేదు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం-2005 బోర్డు బదిలీ అయిన అధికారుల పేర్లుతో ఉంది. సమాచార అధికారిగా ఎంవీ దుర్గాప్రసాద్ పెనుగంచిప్రోలు మండలం నుంచి విజయవాడ రూరల్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న బీఎల్‌వీ శేషగిరిరావు ద్వామాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా అప్పిలేట్ అథారిటీ ఎంపీడీఓగా జె. సునీత బదిలీ అయ్యి కొన్ని సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ ఆమె పేరు సమాచార హక్కు బోర్డుపై ఉండటం గమనార్హం. ఎంపీడీఓగా ముగ్గురు అధికారులు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించి, వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. సమస్యలపై అధికారులకు సమాచారం అందించాల్సిన సమాచార హక్కు చట్టం బోర్డులోనే తప్పులుంటే ప్రజలు ఎవరికి ఫిర్యాదు చేస్తారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



సమాచార హక్కు చట్టం బోర్డు

జీతాలు ఇస్తేనే సమ్మె విరమణ

మున్సిపాలిటీ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లిస్తేనే సమ్మె విరమణ చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు సోమవారం వ్యాన్ డ్రైవర్లు, సీఐటీయూ నేతలతో తాడిగడప కమిషనర్ భవానీప్రసాద్ జరిపిన సంప్రదింపుల్లో డ్రైవర్లు తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ గత మూడు నెలలుగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు జీతాలు చెల్లించలేదన్నారు. గత 15 రోజులుగా వ్యాన్ డ్రైవర్లు సమ్మె చేస్తున్నా జీతాలు ఇవ్వలేదన్నారు. అధికారులు వెంటనే జీతాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. జీతాలు అందిన వెంటనే వ్యాన్ డ్రైవర్లు సమ్మె విరమించి విధులకు హాజరవుతారని తెలిపారు. కాగా వ్యాన్ డ్రైవర్లు జీతాల కోసం తమ నిరసనను యథావిధిగా కొనసాగించారు. కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్‌వలి, వై. సరళ, బ్రహ్మం, శ్రీహరి, సూర్యనారాయణ, శివశంకర్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాన్ డ్రైవర్లు, సీఐటీయూ నేతలు

ఎనికేపాడులో గ్రామ పంచాయతీ సమావేశం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఇందులో పలు అంశాలను పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. గ్రామంలోని నల్లూరివారి కట్ట రోడ్డును పంచాయతీ సాధారణ నిధులు రూ. 18.50 లక్షలతో అభివృద్ధి చేసేందుకు పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. గ్రామంలో అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌ల వద్ద అతి సమీపంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారుతున్నాయని సమావేశంలో చర్చించారు. అలాగే గ్రామంలోని పలు సమస్యలను పంచాయతీ కార్యదర్శి విద్యాధర్ దృష్టికి పాలకవర్గ సభ్యులు తీసుకెళ్లారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు మాదు సుబ్బారావు, రాచమళ్ల రత్నకుమారి, గంగుల శ్రీనివాస్, వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు, పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు, మహిళలు బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకోకపోవడం వల్ల అధికంగా రక్తహీనతకు గురవుతున్నారని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) హనుమాన్‌జంక్షన్ డిపో మేనేజర్ జె. హరిత అన్నారు. స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఎఫ్‌సీఐ ఆధ్వర్యాన పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఫోర్టిఫైడ్ రైస్‌ను సరఫరా చేస్తోందని ఆమె వివరించారు. ఈ ఫోర్టిఫైడ్ రైస్‌లో మైక్రో న్యూట్రియంట్స్, ఫోలిక్ యాసిడ్, విటమిన్-బీ ఉంటాయని చెప్పారు. ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ ఎం. జగతాంబల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఈడుపుగల్లు విద్యార్థులు

కంకిపాడు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో గొడవర్రు జెడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు హెచ్ఎం కె.సుబ్రమణ్యం ఎంపికైన క్రీడాకారులను సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయిలో అండర్-14, 17 విభాగాల్లో జగ్గయ్యపేట జిల్లా పరిషత్ పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఎం.రిషిత, బుస్కా అశ్విన్, బత్తుల డానియేల్, కె.వెంకటేష్, దాసరి శ్రీజ, వ్యాయామ ఉపాధ్యాయులు బోయిన శ్రీగంగ, లీలాకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

- అథ్లెటిక్స్ పోటీల్లో ఈడుపుగల్లు జిల్లా పరిషత్ విద్యార్థులు సత్తాచాటారు. క్రీడాకారులను ఇన్‌చార్జి హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాళహస్తిలో నిర్వహించిన జూడోలో పాఠశాలకు చెందిన ఎస్. లక్ష్మణ్‌కుమార్ అండర్-17 విభాగంలో బంగారు పతకాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. అండర్-19 విభాగంలో షేక్ రెహమత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. అలాగే జగ్గయ్యపేట జెడ్పీ పాఠశాలలో ఇటీవల జరిగిన క్రీడల్లో పి.దుర్గాభవాని, వి.దివ్య హాసిని సత్తాచాటారని పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు దుర్గాభవానిని అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గొడవర్రు విద్యార్థులు



ఎంపికైన దావాజీగూడెం విద్యార్థినులతో హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

గన్నవరం: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు మండలంలోని దావాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో క్రీడా నైపుణ్యం కనబరిచిన కె. అఖిల, టి. రేష్మిత, ఎం. హర్షిత, సిహెచ్. రిశ్విత, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్. చందు, విజయకుమారిని హెచ్ఎంతోపాటు విద్యా కమిటీ ఛైర్మన్ సుకన్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కోతకు గురైన రహదారి

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం ఊరచెరువు రోడ్డు కోతకు గురయ్యింది. అయినా పాలకులు, అధికారులకు పట్టడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వీరపనేనిగూడెం నుంచి చిక్కవరం వెళ్లే రోడ్డు మార్గంలో కొత్తగూడెం ఊరి సెంటర్‌లో రహదారి సగానికి పైగా కోతకు గురైంది. ఈ మార్గంలో నిరంతరం ప్రయివేటు పాఠశాలల బస్సులు, ట్రాక్టర్‌లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు మొత్తం కోతకు గురై ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డు వెంట మట్టి పోయించాలని గ్రామస్తులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కొత్తగూడెం వద్ద కోతకు గురైన రహదారి

అంగన్‌వాడీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ జి. మంగమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-10లో సహాయకురాలు(ఎస్సీ), రామవరప్పాడు గ్రామం-5 (ఓసీ), 9(ఎస్సీ) సహాయకురాలు, రాయనపాడు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-3(ఎస్సీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణతతో 21 నుంచి 35 సంవత్సరాలు వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు కానూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు.

పెనమలూరులో చైన్ స్నాచింగ్

పెనమలూరు: పెనమలూరులో సోమవారం చైన్ స్నాచింగ్ జరిగింది. క్రైమ్ పోలీసుల కథనం మేరకు.. పెనమలూరు గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు చెన్నుపాటి లక్ష్మి, మల్లికార్జునరావు ఉదయం వంతెన డౌన్‌లో కాలువ కట్టపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లక్ష్మి మెడలో బంగారు గొలుసు తెంచుకుని పారిపోయాడు. బాధితులు గట్టిగా కేకలు వేసినా దొంగ దొరకలేదు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పి. హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 10నుంచి 11 గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ పి. శివాజీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరం డిపో నుంచి నడుపుతున్న ఆర్టీసీ బస్ సర్వీస్‌లకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను 8790996090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

2న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వచ్చే నెల 2వ తేది ఉదయం 10 గంటలకు ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ టి. స్వర్ణలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రభుత్వ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరపనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

రీసర్వేపై గ్రామ సభలు

పెనమలూరు: భూముల రీసర్వేపై ఈనెల 30వ తేదీన పెనమలూరు, వచ్చేనెల 1న గంగూరు, 2వ తేదీన వణుకూరు, 4న గోసాలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. భూముల యజమానులు అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

ఉయ్యూరు: అరుణాచలంకు ఉయ్యూరు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు ఉయ్యూరు డిపో మేనేజరు కెఎస్ఆర్‌కె. ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల 4వ తేదీ రాత్రి ఎనిమిది గంటలకు సూపర్‌లగ్జరీ బస్సు ఉయ్యూరు నుంచి బయలుదేరుతుందన్నారు. ఇతర వివరాలకు 8919366868, 9553205796 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వికాస్ కళాశాలలో ప్లేస్మెంట్ డ్రైవ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం రాజ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యాన క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 45 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రాజ్ గ్రూప్ సీఈఓ పి.రాజ్, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ ఎస్. కిషోర్‌బాబు, జి. వడ్డీకాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా ఈపూరు మండలం, కోండ్రమాట్ల గ్రామానికి చెందిన కాలువ కోటేశ్వరమ్మకు ఇద్దరు పిల్లలు. భర్త చనిపోవడంతో కుమారుడిని పోరంకి ప్రభునగర్‌లో ఉన్న వల్లూరుపల్లి నవరత్నం అనాథ శరణాలయం హాస్టల్‌లో చేర్పించింది. అయితే ఈనెల 26వ తేదీన హాస్టల్‌లో ఉంటున్న బాలుడు పాఠశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు రాలేదు. దీంతో వార్డెన్ తల్లికి సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

30 మందికి జరిమానా

విజయవాడస్పోర్ట్స్: మద్యం సేవించి మోటారు వాహనాలు నడుపుతున్న 30 మందికి రైల్వే కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.శర్మ సోమవారం జరిమానా విధించారు. మూడో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.